# ఆమె కళ్లు

## "సత్యశ్రీ"

ఆమె కళ్లంటే నాకు చాలా యిష్టం. ఆమె మృగాక్షి, హరిణలోచని, క్రీగంటి ..వాల్గంటి! యింకా—యింకా ... ఆమె తెల్లటి కళ్లకి, నల్లటి కాటుకరేఖ ఎంతో అందాన్నిస్తుంది. ఆమెవి చెదరే జింకకళ్లు. చెదరే లేడికళ్లు.

నేను ఒక దేశద్రిమ్మరిని. ఎందుకలా అయ్యావని నన్ను అడక్కండి— నాకు నచ్చిన పట్నం, పల్లె తిరుగుతుంటాను. ముఖ్యంగా మా పెద్దలు సంపాదించి, నాచేతులో పోసిపోయిన, కరెన్సీ, కావలసినంత ఆస్తి ఈవిధంగా ఖర్చుపెడుతూంటంలో వుండే ఆనందం నాకు మరెందులో కనిపించలేదు.

అవి నేను బొంబాయిలో వుంటున్న రోజులు. అప్పుడు నేనుంటూన్నది బొంబాయిలో ప్రసిద్ధమైన హోటళ్లలో ఒకటైన 'లాల్‌హోటల్'లో 82 వ గది. అది నాలుగంతస్తుల మేడ. నేనున్నది మూడో అంతస్తులో మారుమూల గది. ఆహోటల్ ఎప్పుడు రద్దీగా ఉండేది. గదులన్నీ ఎప్పుడు ఖాళీగా వుండేవి కావు. వ్యాపారస్తులు—ప్రయాణీకులు, నాబోటి దేశద్రిమ్మరులు — క్రొత్తగాపెళ్లయి 'హనీమూన్' కొచ్చిన దంపతులు — పారిపోయి లేచివచ్చిన జంటలు — వివిధ రకాలవాళ్లు వుండేవాళ్లు. వివిధ భాషలు మాట్లాడుకొనే వాళ్లు. నా మాతృభాష తెలుగు తప్పిస్తే నే ధారాళంగా మాట్లాడ గలివి ఇంగ్లీషు, హిందీ మాత్రమే. ఈ రెండు వస్తే చాలు. ఉత్తర హిందూస్థానంలో మెలగడం తేలికే. అక్కడక్కడ ఎక్కువ నెలలకు నెలలే వుండటం వల్ల, బెంగాల్, మరాటీకూడా కొద్దికొద్దిగా మాట్లాడ గలను.

ఉదయం 7 గం. ల కల్లా 'బోయ్' టీ, టిఫెను రూమ్‌కు తెచ్చేవాడు. అది తీసుకుని 11 గం. వూళ్లో తిరిగే వాణ్ణి. తెలిసిన మిత్రుల దగ్గరకో, లేకపోతే క్లబ్బుకో, గుర్రపు పందేల్ని చూస్తూనో, కాలక్షేపం చేసేవాణ్ణి. తరువాత గదికివచ్చి 'విశ్రాంతి' తీసుకుని(ఒకోసారి ఏ మిత్రుడైనా తన యింటికి భోజనానికి రమ్మని పిలిస్తే వెళ్లక తప్పేది కాదు.) యిక మధ్యాహ్నం ఎక్కడికీ వెళ్లకుండా గదిలోనే నిద్రపోతూనో, పత్రికలు పుస్తకాలతోనో జరిగిపోయేది కాలం. సాయంత్రం షికారుకి — రాత్రుళ్లు అప్పుడప్పుడూ ఏదైనా 'షో' కి వెళ్లేవాణ్ణి.

నా రూముకి ప్రక్కగా 81 నెం. గదిలో ఎవరో హనీమూన్‌కు వచ్చిన నూతన దంపతులో, లేక లేచిపోయి వచ్చిన పిట్టలో చాలా కులాసాగా కేరింతాలు కొడుతూ, నవ్వుతూ గడిపే వారు. రాత్రులు ఏవేవో ప్రణయ సంభాషణలు మాట్లాడుకునేవాళ్లు. ఆ స్థూలకాయురాలైన బెంగాలీ యువతికి, సన్నగా తెల్లగా, పాలిపోయి నట్లు కనిపించే ఆ మరాటీ యువకుడికి స్నేహం ఎట్లా కుదిరిందో నా కర్థం కాదు.

లాల్ హోటల్‌కి వెనకాల, రోడ్డుకి అవతలగా, సుమారు 160 గజాల దూరంలో రెండంతస్తుల మేడఒకటి వుండేది. అదివరిదో నాకు సరీగా తెలీదు. రాత్రులు మాత్రం ఆ మేడ దగ్గరకు కార్లు వచ్చి ఆగేవి. కొన్ని కొంతసేపు వుండి పోయేవి. కొన్ని తెల్లవార్లూ వుండి ప్రొద్దున్నే పోయేవి. రాత్రులు ఆ మేడ కిటికీ అద్దాలలోంచి ఆకుపచ్చటిఎలక్ట్రిక్ లైట్లకాంతి బయటకు వెదజిమ్ముతుండేది. ఆ అద్దాల వెనకాల ఏవేవోనీలినీడలు అటూ, యిటూ తిరుగుతూండేవి.

సాయంత్రం 5, 6 గం. లకు అయిదుగురు అందమైన అమ్మాయిలు ఆ మేడమీదకొచ్చి 'షికారుగా' తిరిగేవారు. రాత్రులు కనిపించే నీలినీడలు వీళ్లవేఅనుకుంటా! వాళ్లల్లో వాళ్లు ఏవేవోమాట్లాడుకుంటూ, నవ్వుకుంటూ గడిపే వాళ్లు — అప్పుడప్పుడు అటునుంచి గాలి బలంగా వీచినప్పుడు వాళ్లు మాట్లాడుకునే మాటలు నవ్వే నవ్వులు చెదరిపోయిన తరంగాలులా అస్పష్టంగా వినిపించేవి. వాళ్లు మేడమీద తిరుగుతూన్నప్పుడు వాళ్లు కట్టుకున్న సిల్కు చీరలు గాలికి రెపరెపలాడేవి ...! అందాన్ని చూస్తున్నంతసేపు, అందని ఆశల్ని సృష్టించుకోడం, తియ్యని అనుభూతి పొందాలనుకోడం — ఉడుకు రక్తం పొంగే ప్రతీ యువకుడిలో ఉన్న బలహీనతే అది!

నేను ఈ సన్నివేశం చూసిన దగ్గరనుంచి 5 గం.రూమ్ వదలబుద్ధి అయ్యేది కాదు. రూమ్‌కి వచ్చినమిత్రులకి ఏదోవిషయం చెప్పి వెళ్లడం తప్పించుకునేవాణ్ణి.

నేను వుంటూన్న రూమ్ కిటికీలోనుంచి గుర్రపు పందేల్ని చూడటానికని కొన్న 'బైనాక్యులర్' పెట్టి వాళ్లని చూచేవాణ్ణి ..! యిలా చేస్తూన్నానని ఏమీరు ఏమైనా అనుకోండి — వున్నది వున్నట్టు నిజం దాచకుండా చెప్పేస్తున్నాను.

బైనాక్యులర్ లోనుంచి వాళ్లు నా కంటికి దగ్గరగా కనిపించేవాళ్లు, ఒకొక్కర్నే విడివిడిగా చూచాను. వాళ్లలో ఒకామె కొంచెం లావుగా వుంది. అందరికన్నా వయస్సు ఎక్కువగా వుంటుంది. తక్కిన ముగ్గురు సామాన్యమైన లావు వుండి, తెల్లగా ఆరవిచ్చిన తామరపువ్వుల్లా వున్నారు. సోగదేరిన కళ్లలోనుంచి యవ్వనపు బిగువు చిమ్ముతోంది.

చివరామె అందరికంటే చిన్నది. దాదాపు 17, 18 సంవత్సరాల కంటే ఎక్కువ వుండవు. చాలా సన్నగా పొడుగ్గా ... తెల్లగా బలహీనంగా వుంది. అంత బలహీనంగా వున్నా అందరికన్నా అందంగా కనిపించింది నాకు.

శిథిలమై, శల్యంలా కనిపించే ఆమె శరీరంలో అందమంతా పోయి, ఆమె కళ్లల్లో గూడుకట్టుకొని, నిలచి వున్నట్టు వుండేవి ఆమె కళ్లు ...! విశాలంగా, తెల్ల తామర రేకుల్లా వుండేవి. నెలవంకలా వంగిన కనుబొమ్మలు. అనుక్షణం చెదరే నల్లటి కంటిపాపలు, క్రింది రెప్పకి సన్నగా, నాజూగ్గా పెట్టిన కాటుకరేఖ ఎంతో అందాన్నిచ్చాయి ఆమె కళ్లకు... ఆమె కళ్లల్లో మిగతా నలుగురిలో వున్న మత్తు కరిగించే 'కైపు' కన్నా, ఈమె కళ్లల్లో దీనత్వం, అమాయికత, జాలి, దైన్యం అన్నీ మిళితమై వున్నాయి. ఆ కళ్లే నన్ను బాగా ఆకర్షించాయి. పదేపదే చూడాలని ప్రేరేపించేవి.

ప్రతిసాయంత్రం నాకు యిదేపని. మిత్రులు వచ్చినా జ్వరం మొస్తోందని వంక పెట్టేవాణ్ణి. నా బైనాక్యులర్ ఎప్పుడూ ఆమెను, ఆమెకళ్లను చూపెట్టేది. ఆమెకళ్ళదగ్గర నాకళ్ళు పెట్టి ఏరిఆశల్నికల్పించుకునేవాణ్ణి..! ఒకోవ్యక్తి తాను చూస్తూంటాడు. అనుక్షణం ఆఘడియల కోసం తపించిపోతూంటాడు. అదిఅందుబాటులో ఉండీ, లేనిదీ ఆసమయంలో తట్టదు. వాటిని గురించిన భావాలుతోలతలు అల్లుకుంటాడు. అవి నెరవేరుతవోలేదో అనే యోచన తట్టదు. నేనూ అంతే......!

ఆవేళ నేను సాయంత్రం 4 –30 గం. నిద్ర లేచేసరికి నా మంచం ప్రక్కనే వున్న సోఫాలో శంకర్ కూర్చుని ఏదో యింగ్లీషు పత్రిక తిరగవేస్తూన్నాడు.

"అరె! ఎంత సేపయింది భాయ్! నువ్వొచ్చి! నన్ను లేపలేదేం..." అన్నాను. ప్రక్కమీదనుంచి లేస్తూ.

నాకు ఆవూరులో వున్న మిత్రులందరిలో కల్లా, శంకర్ ఒక్కడే చాలా సన్నిహితంగా మనసిచ్చి మాట్లాడుతాడు. అతను అవడానికి మరాటీవాడైనా తెలుగు వాళ్ళంటే తెలుగు దేశం అంటే అతనికి చాలా అభిమానం. వాళ్ళ బంధువులెవరో తెలుగు దేశంలో వ్యాపారం చేస్తూంటా

లసి, తనకు రెండు మూడుసార్లు ఆంధ్రదేశం చూచే భాగ్యం కలిగిందని చెప్పేవాడు..

"యిప్పుడే భాయ్...! పావుగంట అవుతుంది. నిద్రపోయేవాణ్ని లేపడం ఎందుకని కూర్చున్నా!" అన్నాడు శంకర్ నవ్వుతూ. అతని ముఖం ఎప్పుడూ చిరునవ్వు చిందుతూంటుంది".

"నిద్రపోతేమాత్రం? లేపకపోయావా..?" అంటూ బాత్‌రూంలోకి వెళ్ళి టేప్‌దగ్గర ముఖం కడుక్కుని వచ్చాను.

బెడ్డింగులోవున్న టవల్ తీసి ముఖం తుడుచుకుంటూంటే శంకర్ అన్నాడు. "ఏం భాయ్! నీ ఒంట్లో యిప్పుడెలాగుంది? జ్వరం నయమయిందా..?" అని.

"పచ్చి అబద్ధం. నావంట్లో కులాసాగానే వుంది. అసలు జ్వరమనేదే నాకింతవరకూ ఎప్పుడూ రానేలేదు. బయటకు వెళ్ళబడుతుందనే పంతతో అలా అభద్ధమాడాను.

"యిప్పుడు కొంచెంనయమే భాయ్!" అన్నాను. యిది అబద్ధమేనని వేరే చెప్పనవసరం లేదు.

ఇంతలో బాయ్ టీ, బిస్కెట్లు, ట్రేలో పెట్టి తీసుకొచ్చాడు. శంకర్‌గూడా వున్నాడు గాబట్టి మరో టీ తెమ్మన్నాను. బోయ్ క్రిందికి వెళ్ళాడు.

"చూడు—సతీష్‌భయ్యా..! (నాపేరు సత్యనారాయణ అయినా అంతపొడుగు ఉచ్చరించలేకో, ఉత్తర హిందూస్థానీకి చెందినవాడవడం వల్లో ఆ నుడికారంతోనే పిలిచేవాడు శంకర్)— నువ్వూ ఈవేళ తప్పకుండా వూళ్ళోకి రావాలి...!" అన్నాడు.

నేను ప్రతిరోజూ, రానంటే సభ్యతగా వుండదు. యిక తప్పనిసరి అనిపించింది. ఈ రోజుకి ఆమెను, ఆమె కళ్ళను చూచే భాగ్యం లేదనుకున్నాను.

"యివ్వాళ నీకు మాయింట్లో విందు— తప్పకుండారావాలి..!" అన్నాడు శంకర్ నవ్వుతూ.

నేనూ నవ్వాను శంకర్ ఇదివరకెప్పుడూ నన్ను భోజనానికి పిలవలేదు. అలాగే అయితే ఈవాళ మీయింటో ఏమిటో చెప్పావు కావు?" అన్నాను.

అతనియిల్లు నేను యిదివరకు చూచివుండలేదు. ఎక్కువగా అతనేరూమ్‌కి రావడం వూళ్ళో తిరిగి వచ్చెయ్యడమే గాని అతని ఇంటికి ఎప్పుడూ వెళ్ళలేదు నేను.

"ఈ వేళ మారెండోవాడి పుట్టిన రోజు!" అన్నాడు శంకర్. అతనికి యిద్దరు కొడుకులు, ఒక కూతురు వున్నారని యిదివరకే చెప్పేడు.

"ఓహో! తప్పకుండావస్తా..!"అన్నానుయిక విలాసగా వెళ్ళడం తప్పదనే ఉద్దేశ్యంతో.

బట్టలు వేసుకుని తలదువ్వుకుంటూంటే బోయ్ మరో టీ, బిస్కెట్లు తీసుకొచ్చాడు.

యిద్దరం టీ తీసుకున్నాం. తీసుకున్న తరువాత వాటన్నిటికీ డబ్బులిచ్చి, ఖాళీ కప్పులు ట్రేలో పెట్టి దాన్ని అరచేతిలో పెట్టుకుని నిలబడ్డాడు. వాడెందుకునిలబడ్డాడో నాకు తెలుసు. ప్రత్యేకంగా తెచ్చిన టీ కి డబ్బులిచ్చాను. వాడు అవి తీసుకుని మేడ దిగుతూంటే శంకర్ అన్నాడు! "భాయ్! ఈవేళరాత్రికిభోజనంతేవద్దని చెప్పు!" అని.

నేను వాణ్ని వెనక్కు పిలిచి అలానే చెప్పేను. వాడు 'సరే'నంటూ వెళ్ళిపోయాడు.

"సరే! యిక పోదామా? వూళ్ళో అలాకొంతసేపు తిరిగి 7 గం. కల్లా యింటికెళదాం..!" అన్నాడు శంకర్.

నేను బట్టలు అవి వేసుకోడం అయిపోయిన తరువాత, రూమ్‌కి తాళం వేసి బయలు దేరాను. వచ్చేటప్పుడు ఆమేడ మీదకు వాళ్ళు వచ్చి వున్నారు అప్పటికే. ఈ రోజు ఆ అదృష్టానికి నోచుకోలేదనుకున్నాను.

7 గం. కల్లా శంకర్ వాళ్ళ యింటికి తీసుకెళ్ళాడు.

వాళ్ళది చిన్నమేడ. వాకిటి ముందు గుమ్మం ఆర్చికి చిక్కగా అల్లుకున్న క్రీపరు పువ్వులు, గుత్తులు గుత్తులుగా వేళ్ళాడుతున్నాయి. అక్కడక్కడ వేసిన క్రోటన్సు మొక్కలు రంగు రంగులతో రక రకాలుగా అలంకరించి వున్నాయి. దీన్నిబట్టి చూస్తే, అతను ఒకమాదిరి స్థితిమంతుడేనని తెలుసుకోవచ్చును.

నన్ను ఒక గదిలోకి తీసుకెళ్ళి సోఫాలో కూర్చోమని తాను యింట్లోకి వెళ్ళాడు.

ఆ గది చాలా అందంగా వుంది. గదిమధ్యగా నీలవర్ణం ట్యూబ్‌లైటు వేళ్ళాడుతూంది. నేలపైన గచ్చు కనబడకుండా పువ్వుల తివాసీ పరిచి వుంది. గోడలకి సురయ, మధుబాల, నర్గీస్ నూతన్ ఫోటోలు తగిలించి వున్నాయి. రెండు మూడు దేశీయ నాయకుల ఫోటోలు గదిగుమ్మానికెదురుగా, గుర్రంమీద స్వారీ చేస్తున్న శివాజీ ఫోటోలు వున్నాయి. శివాజీ ఫోటోకిమాత్రం అప్పుడప్పుడే కట్టిన గులాబీపూలదండ వేసివుంది.

వీళ్ళేభాయి! మా యిద్దరి మొగపిల్లలు. . .! పెద్దపిల్ల ఎక్కడికో వెళ్ళింది. . మా అన్నగారింటి కనుకుంటూ. . !" అంటూ, చిన్నవాణ్ణి చంకలోను, పెద్దవాణ్ణి నడిపించుకుంటూ గదిలోకి వచ్చాడు శంకర్.

వాళ్ళిద్దర్నీ పరామర్శించాను. చిన్నవాణ్ణి వళ్ళోకి తీసుకున్నాను. పెద్దవాణ్ణి దగ్గర కూర్చోబెట్టుకున్నాను.

"ఈరోజున పుట్టింది వీడేభాయి..! శివాజీ!" అంటూ చిన్నవాణ్ని చూపెట్టాడు.

నేను నవ్వి, బజారులో కొన్న బహుమానం వాడికిచ్చాను.

శంకర్ లోపలకెళ్ళాడు. అంతసేపు వాళ్ళూ నేనూ మాట్లాడుకొని నవ్వుకున్నాం. పెద్దవాడు వెళ్ళి టేబుల్‌మీదవున్న రేడియో 'ఆన్'చేశాడు.

యింతలో శంకర్ పళ్ళాలతో ఏవో ఏవో పెట్టి తీసుకొచ్చాడు. అవన్నీ తీసుకోలేకపోయినా బలవంతంమీద కొంతవరకూ తీసుకున్నాను.

మాపని ముగిసింది. తరువాత శంకర్‌అన్నాడు 'భాయ్. .! సినిమాకు పోదామా ? 'మధుమతి' చాలా బాగుంటుంది!"

నాకు సినిమా మీద పోలేదు.

"ఎందుకుభాయ్. .? యివ్వాళ పౌర్ణమి కూడాను. . అలా మెరిన్‌డ్రైవ్"కేసి పోదాం! పుచ్చపువ్వులాంటి వెన్నెల సముద్రపు అలల మీదపడి వాటితోపాటు చలిస్తూంటే, చూస్తూ కూర్చుంటంలో ఆనందం లేదూ ?" అన్నాను.

శంకర్ నవ్వాడు, "సరే! అలాగే!" అంటూ బయలుదేరాడు.

యిసుకలో కూర్చున్నాము. పౌర్ణమి వెన్నెల అక్కడక్కడ యిసుకలోని తళుకులు మినుకు మినుకునే మెరుస్తున్నాయి. సముద్రం హోరపెడుతోంది. కల్లోలమైవున్న అలలమీద పాలవెన్నెల పడి చిమ్ముతూ అత్యంత రమణీయంగా వుంది సముద్రం.

నా మనస్సంతా ఆహోటల్‌కేసి పోతుంది. ఆమేడలో ఉన్నవాళ్ళు ఎవరు ? అదే నాకర్థంగావడంలేదు. ఆమెకళ్ళు ఎదురుగుండా కనిపిస్తున్నాయి. . ఆ ఆకుపచ్చని అద్దాల కిటికీలలోనుంచిసీలి నీడలు తిరిగినట్టు అనిపిస్తూంది. వాళ్ళెవరో. శంకర్‌ను అడిగి తెలుసుకోవాలనిపించింది. 'వాళ్ళెవ'రని శంకర్‌ను అడుగుదామనిపించింది. కాని శంకర్ సంసారి. యితర ఆడవాళ్ళను గురించిన ప్రస్తావన యిదివరకెన్నడూ అతన్ని నేను అడగలేదు. అడిగితే ఏమనుకుంటాడోననిపించింది. కానీ, వాళ్ళనుగురించి తెలుసుకోదలిస్తే, బాగా పరిచయమైన వ్యక్తి, మనసువిప్పి చెప్పుకునే చనువు యితని దగ్గరే వున్నాయి. ఏమయినాసరే వాళ్ళనుగురించి శంకర్‌నే అడగాలనుకున్నాను.

"శంకర్!" ఆమేడ ఎవరిదంటావు. . . ?" అన్నాను మెల్లగా.

శంకర్ సముద్రపు పొంగుచూస్తున్నాడు. నాప్రశ్నవిని పరధ్యాన్నంగానే, "ఏమేడ. .?" అన్నాడు.

"అదే. . .! మన లాల్‌హోటల్‌కి వెనకవున్న అద్దాలమేడ. .!"

శంకర్ నవ్వాడు. నా కళ్ళలోకి సూటిగా చూచి నవ్వాడు.

"ఓ. .! అదా. . .?" అని కొన్నిక్షణాలాగి, "అందమైన రంగురంగుల పుష్పాల్ని చూస్తున్నప్పుడు ప్రతివాడి మనస్సు చలిస్తూంటుంది. అవునా. . సతీష్‌భాయ్. . .?" అన్నాడు మళ్ళీ చిరునవ్వుతో.

నేను కాస్త సిగ్గుపడ్డాను దొరికిపోయినవాడిలా.

"అంటే. . .?" అన్నాను ఏమీ అర్థమవనట్టు. .

"అంటే, నీకు ఆ మేడలో వుండే అంత

మైన అమ్మాయిలను గురించికదా నీకు ఆమేడ విషయం కావాల్సి వస్తే...?"

"అహా! అదికాదు — పూరికినే తెలుసుకోవాలనే ఉద్దేశ్యంతో అడిగాను. అంతకుతప్ప మరే ఉద్దేశ్యమూ లేదు—" అన్నాను కొంచం తడబడుతూనే.

నా కంగారుకు శంకర్ నవ్వాడు.

"అందులో తప్పేముంది భాయ్. . అంత కంగారు దేనికి. . . ? వాళ్లను గురించి తెలుసుకోడం తప్పేమీ కాదు. . డబ్బుగల ప్రతివాడికీ వాళ్లమీద హక్కువుంది. . కావాలంటే నీకూ వుంటుంది. . !" అన్నాడు శంకర్.

నా తల తిరిగిపోయింది. వాళ్లు సంపన్నగృహస్తులు. . . అతి హోదాగల సంసారుల్లా కనిపించారు. . నేనూ అలానే వూహించాను. కాని శంకర్ ధోరణి విచిత్రంగావుంది.

"అంటే." నాకు సరిగా అర్థంకాలేదు. .!' అన్నాను. పూర్తిగా అతనితోటే చెప్పేద్దామని.

"యింకా అర్థంకాలేదూ ? నువ్వెప్పుడూ రాత్రులు ఆమేడముందు ధగధగమెరిసే కార్లు ఆగటం చూడలేదూ ?

"ఆగితే. . .?"

"ఆమాత్రం గ్రహించలేవూ ? వాళ్లది అదే వృత్తి. . వాళ్లు వేశ్యలు. . .!

"వేశ్యలా . .?"

వీళ్లు వేశ్యలై వుంటారని నేను కల్లోకూడా అనుకోలేదు. యిది వినగానే నా మనస్సు పరిపరి విధాలుగా పోయింది. యిక ఏమిమాట్లాడాలో అర్థంకాక ఆలోచిస్తూ కూర్చుండిపోయాను క్షణంసేపు.

"చూడు సతీష్. . .! ఆ అయిదుగురిలో, నీ మనస్సు దోచుకున్న సుందరాంగి ఎవరు ?" అన్నాడు శంకర్ నాముఖంలోకి చూస్తూ.

నేను జంకాను నిజం చెప్పడానికి. .

"అబ్బే! లేదు శంకర్! పూరికినే అడిగాను, అంతే. .!"

శంకర్ నవ్వాడు మళ్లీ, అతనిలో ఉత్సాహం ఉలికింది నాలోని కోర్కెను తెలుసుకోవాలని.

ఆలా సిగ్గు పడితే ఏం లాభం. మనస్సులో వున్న దాన్ని బయటకు చెప్పు యీ ప్రాయంలో యిటువంటి కోర్కెలుఉదయించడం తప్పుకాదు. మన కోర్కెల్ని సిగ్గు చేత భయం చేత అలాగే మనస్సులో వుంచుకొని మధన పడటం కన్నా తెలివితక్కువతనం మరొకటిలేదు. . . . . . అయినా అవి అందరాని గగన కుసుమాలు కావు. .

యింత కలుపుగోడు తనంగా అడుగుతోంటే, యిక నా ఉద్దేశ్యాన్ని చెప్పక తప్పింది, కాదు.

"అదే . . .! చూడు అందరికన్నా సన్నగా . . . తెల్లగా . . . పొడుగ్గా . . . లేత తామర తూడులా . ." జంకుతూ, సిగ్గుపడుతూ చెప్పాను.

"ఓ . . .! అదా . . .! పంజాబీపిల్ల . . .! 'నిక్కీ!' అవి, కొన్ని క్షణాలాగి, ఆమె ఏమంత అందంగా వుండదుకదు భాయ్ . . .! చిక్కిపోయి కళ్లల్లో ప్రాణాలు పెట్టుకుని, ఎప్పుడూ నిరుత్సాహంగా వుంటుంది... అసలు ఆమె నీకెలా నచ్చిందో . . .?' అన్నాడు.

నా కాశ్చర్యం వేసింది. ఆమె అందంగా వుండదంటే నేను ఒప్పుకోను — అసలు వీళ్లకు అందం అంటే ఏమిటో సరిగా తెలియ దనుకుంటాను.

"ఆమె అందంగా వుండదంటే నే వొప్పుకోను శంకర్ . . .! ముఖ్యంగా ఆమె కళ్లలోనుంచి చిందే అమాయికత్వం, దైన్యం నన్ను ఆకర్షించాయి..!" అన్నాను శంకర్ తో.

శంకర్ నవ్వాడు, "సహజంగా కైపుతో, మత్తెక్కించే యవ్వనపు బిగువుతో ఉండే కళ్లనే కోరుకుంటారు ఎవరయినా . . .! ఏమిటో!నీకవి నచ్చాయంటే నాకు చిత్రంగా వుంది...! అంటూ శంకర్ పెదవి విరిచాడు. నేనేమీ మాట్లాడలేదు. సముద్రంపైన పడే వెన్నెల నీడల్లో. ఏవోఏవో భావాలు తిరుగుతూన్నాయి ... మనస్సు పరిపరి విధాలుగా పోతుంది! శంకర్ కొన్ని క్షణాలు ఉండి అన్నాడు.

"నీ కిష్టమైతే ఈ రాత్రికే వెళదాం . . .! ఆ మేడలోకి . . . ఏమంటావు! నాకు వాళ్లంతా పరిచయమే . . .! నీకూ పరిచయం చేస్తాను...!" అనినాకళ్లల్లోకి సూటిగా చూచాడు శంకర్ . . .

నేను ఉలిక్కిపడ్డాను. ఎందుకో సంశయించాను. నేనేమైనా తప్పుపని చెయ్యబోతున్నానా.? నేను సాహసిస్తే ఆమె ఆ నరకకూపంలో ఎందుకుండాల్సి వస్తుంది . . .? ఏమో! అంత సాహసం నాలో వుందా . . .?

శంకర్ అడిగిన ప్రశ్నకు సమాధానం యివ్వలేదు". అందుకని మళ్లీ రెట్టించాడు అదేప్రశ్నను

యిప్పుడు కాదు —! మరో అప్పుడెప్పుడైనా . . . !" అన్నాను.

శంకర్ నవ్వాడు. 'అలా వుండాలి...! నాకిటువంటి వాటిలో ఏమాత్రం వెనుకంజ వేసే పిరికితనం లేదు. బ్రతికున్నంతకాలం ఖుషీగా గడపాలనుకుంటాను...! నా మనస్సు కోరిన ప్రతీ వస్తువూ సాధించి యిస్తుంటాను...! అంతే కదూ సతీష్ భయ్యా . . .?"

అతని ధోరణిబట్టి చూస్తే అతను యిటువంటి విషయాల్లో ఆరితేరినవాడిలా కనిపిస్తున్నాడు. దానికి నాకు చాలా విచారం అనిపించింది. ఎందుకంటే శంకర్ సంసారి. పెళ్లాం, పిల్లలూ వున్నవాడు. అతను యిటువంటి వ్యవహారాల్లో చిక్కుకోడం నాకు అంతగా నచ్చలేదు. నావిషయంవేరు. నాకు సంసారం లేదు. పిల్లలు లేరు... నేను ఏం చేసినా అడ్డుపెట్టేవాళ్లు లేరు. చివరకు నేనేమైపోయినా చింతించేవాళ్లు లేరు... నేను స్వతంత్ర వ్యక్తిని. పైపెచ్చు దేశద్రిమ్మరిని.... !

చాలాసేపు అలానే కూర్చున్నాము. తరువాత శంకర్ లేస్తూ అన్నాడు: "సరే! యిక పోదాం..! రేపు తప్పకుండా వెళదాం అక్కడికి . . .! నీకు ఆమెను పరిచయం చేస్తాను...!" అన్నాడు.

నేను మౌనంగా లేచాను. యిద్దరం బయలుదేరాము. టాక్సీ స్టాండుకు వచ్చి, లోపల నిద్ర కాగలేక జోగుతూన్న డ్రైవర్ని లేపి, యింటి వైపుకి త్రిప్పమన్నాము.

శంకర్ యింటిదగ్గర కొచ్చాక అతను కారులోనుంచి దిగుతూ, "రేపుసాయంత్రం 6 గం.లకు వస్తాను . . .! తప్పకుండా వెళదాం!" అంటూ యింట్లోకి వెళ్లాడు.

టాక్సీ హోటల్ గుమ్మం ముందు ఆగింది. వాడికి డబ్బులిచ్చి పంపి నా రూమ్‌లోకి వచ్చాను.

అప్పటికి రాత్రి 10—30 ని. అవుతుంది. ఆ మేడముందు మూడు కార్లు ఆగి వున్నాయి. ఆకుపచ్చటి వెలుతురు వెదజిమ్మే, ఆ అద్దాల కిటికీల వెనకాల వాళ్ల నీడలు,అప్పుడప్పుడుతిరుగుతున్నట్టు కనిపిస్తున్నాయి.

నా మనస్సులో ఆలోచనలు కెరటాలులా చెలరేగుతూ కలవర పెడుతున్నాయి...ఆమె కళ్లు నాకు జాలిగా, అమాయకంగా కనిపిస్తూ పిలుస్తూన్నట్టున్నాయి. నేను అక్కడకు వెళ్లడం తప్పా . . .? వెళ్లి ఆమెను అక్కడనుంచి తప్పించగల సమర్థత నాలో వుందా . . .? అసలామెకు అదే స్వర్గంగా వుందా . . .? వున్నట్టు ఆమె ముఖంలో కనిపించదు...! ఐనా నేను అంత సాహసం చెయ్యగలనా . . .? యిటువంటి ఆలోచనలతో చాలాసేపటివరకూ గడిపానుఆరాత్రంతా

* * *

తెల్లవారి రాత్రి 8 గం. అయింది. శంకర్ యింకా రాలేదు. 6గం. లకు నాతో వస్తానని చెప్పి చెప్పి యింత వరకు ఏమి చేస్తున్నాడో నాకు అర్థం కాలేదు.

రాత్రి తప్పు అనుకున్న హృదయం యిప్పుడు ముందుకు ఉరకలు తీస్తుంది. అక్కడకు వెళ్లాలి... తప్పకుండా ఆమెతో పరిచయం చేసుకోవా లనిపిస్తుంది. యిప్పుడు శంకర్ ఆలస్యానికి నాలో నిరుత్సాహం బయలుదేరింది.

ఆమె కళ్లు వలపుతో నిండి ఆహ్వానిస్తున్నాయి,జాలిగా పిలుస్తున్నాయి. ఆ కిటికీ అద్దాలనుండి కనిపించే నీలినీడలు నాకు ఏదో సందేశాన్ని అందిస్తున్నాయి...శంకర్ యింకా రాలేదే! బహుశారాడేమో . . .!

అరగంట వరకు నా రూమ్‌లో ఏమీ తోచక అటూ యిటూ తిరిగాను. అంతలోకే రూమ్ బయట బూట్లచప్పుడు టకటకమని వినిపించింది. శంకర్ వచ్చాడు.

"భాయ్ . . .! తొందరగా వద్దామనుకున్నా. కానీ యింటిదగ్గర కొంచం ఆలస్యమైందిం అయినా సాయంత్రమే చెప్పాను లే...! మనం ఈవేళ అక్కడకు వస్తామని...!" అంటూ నవ్వ, "మరి పద — యిప్పటికే ఆలస్యమైంది . . .!" అంటూ తొందరపెట్టాడు శంకర్ .

(సశేషం)

# ఆమె కళ్లు

"సత్యశ్రీ"

(గత సంచిక తరువాయి)

రూమ్‌కు తాళం వేసి రోడ్డుమీదకొచ్చాము.

"వూఁ! ఎక్కు అన్నాడు" శంకర్ కారు తలుపు తీస్తూ.... నేను తెల్లపోయాను.

"అరే....! టాక్సీదేనికి? ఈ రోడ్డు మలుపు తిరిగితే అదేగా....! వందగజాలు కూడా లేదే....!"

శంకర్ నవ్వాడు.

"నీకు తెలీదులే....! అయినా నేను మాయింటి దగ్గరనుంచే ఎక్కివచ్చాను....!" అంటూ శంకర్ లోపల కూర్చున్నాడు. శంకర్‌లో ఈవేళ కనిపించినంత ఉత్సాహం నేను ఎప్పుడూ చూడలేదు అతనిలో.

టాక్సీ ఆ మేడ ముందు ఆగింది. ఇద్దరం దిగి, టాక్సీ డ్రైవర్‌కు డబ్బు ఇచ్చి పంపాము.

ఎందుకో నా గుండెలు వేగంగా కొట్టుకోడం మొదలుపెట్టాయి.

శంకర్ నన్ను లోపలకు తీసుకెళ్లాడు. వరండాలోకి రాగానే ఆ లావుపాటి ఆమె ఎదురుగుండా వచ్చింది నవ్వుతూ.

"ఇతనే నేను చెప్పిన వ్యక్తి....! సతీష్....!" అంటూ పరిచయం చేశాడు. ఆమె నాకళ్లల్లోకి చూచి నవ్వి! నమస్తే!" అంది.... నేనేమీ మాట్లాడలేకపోయాను.... తలవంచుకున్నాను—

"ఇంకా క్రొత్త....! ఇదివరకెప్పుడు ఇటువంటి చోటుకు రాలేదు—" అని శంకర్ నవ్వాడు.

"రేపటినుంచి మీరు తోడు రానవసరం లేదు — రేపటికి అంతా పాతబడిపోతుందనుకుంటా....!" అని నాకళ్లలోకి సూటిగా చూచి నవ్వి,

"రండి....!" అంటూ ముందు నడిచింది ఆమె.

ఆమె వెనకాలే మెట్లెక్కి మేడమీద కెళ్లాము. మేడమీద అన్నిటికన్నా చివరనున్న గది ముందు ఆగింది.

"ఇదే....!" మీరు కోరుకున్న.....!" అంటూ మాట పూర్తికాకుండానే నవ్వింది. శంకర్ నా భుజం తట్టాడు....." ధైర్యంగా వుండు భాయ్....! ఇంక ఈమేడపై గదులలో ఎవ్వరూ లేరు.... మీ రిద్దరే....!" అంటూ నాకు ధైర్యం చెప్పి "ఇక నే కిందకెళతాను....! రేపు ఉదయం రూమ్‌లో కలుసుకుందాం" అంటూ ఇద్దరూ మేడ దిగి వెళ్లిపోయారు.

ఇక నాకు ఏమి చెయ్యాలో తోచడంలేదు. అసలు ఇక్కడకు ఎందుకొచ్చానా అనిపించింది. తిరిగి నా రూమ్‌కి వెళ్లపోదామా అనిపించింది. కానీ వ్యక్తంకాని ఏవోబంధాలునా కాళ్లకు చుట్టుకున్నట్టు అనిపించింది. ఎటూ అర్థంగాక వాళ్లు వెళ్లిన శూన్యంకేసి చూస్తూ నిలుచుండి పోయాను.

కొన్ని క్షణాలు అలానే నిలబడ్డమీదట ధైర్యం చేసి లోపలకు వెళ్లాను.

గది చాలా అందంగా వుంది. గదినిండా ఏవేవో చిత్రాలు, ముఖ్యంగా నగ్న చిత్రాలు ఎక్కువగా వున్నాయి. ఎత్తయిన పట్టె మంచమ్మీద నుంచి, పరుపుమీద, మిల మిల మెరిసే సిల్కు దుప్పటి క్రిందకు జారుతోంది. ప్రక్కనే టేబుల్‌మీద వున్న, పింగాణితో చేసిన, నగ్న యువతీ శిల్పంచేతిలోని అగరు పత్తుల ధూపం సుడులు సుడులుగా తిరుగుతూ పైకి పోతోంది.

ఆమెకి కిటికీ వైపు తిరిగి, రెండు చేతుల తోనూ ముఖం కప్పుకుని నిలబడి వుంది.....! ఆమె నీలవర్ణం నైయిలాన్ చీర కట్టుకుంది. దానిమీద అక్కడక్కడ వున్న బంగారు రంగు నక్షత్రాలు లైట్ల కాంతిలో మెరుస్తున్నాయి. పలుచటి పొగమంచులా వున్న దానిలోనించి ఆమె తెల్లటి శరీరం కనిపిస్తోంది....!

ఆమె అలా రెండు చేతుల్లోనూ ముఖం ఎందుకు దాచుకుందో నా కర్థంకాలేదు. సిగ్గా? భయమా...? ఇటువంటి గృహాల్లో వాటికి స్థానం వుంటుందంటే నేను నమ్మలేను.

నేను ఆమె వెనకాలకి వెళ్లి నిలబడ్డాను .... కానీ వెంటనే ఉలిక్కిపడ్డాను.

ఆమె, వెక్కి వెక్కి ఏడుస్తున్నట్టు వినిపిస్తోంది. ఆపాద మస్తకం వణికిపోతోంది....! జాకెట్ చెమటకు తడిసివుంది.'

నేను ఆశ్చర్యపోయాను. ఎందుకేడుస్తోంది ఆమె — ఎందుకిలా వణికిపోతుంది....? అదే నాకర్థం కాలేదు.

నేను ఎదురుగావెళ్ళి, ముఖానికిఅడ్డుపెట్టుకున్న చేతులు తియ్యడానికి ప్రయత్నించాను. కాని, ఆమె, పులి పంజా పట్టులో నుంచి తప్పించుకున్న లేడిపిల్లలా, అతిభయకంతోఒక్క గెంతువేసి, ఆ మంచమ్మీదపడి, లేచి, ఆశ్చర్యంగా నావంక చూచి, అలానే, పెదాలకు అరచేతిని అడ్డుపెట్టుకు చూస్తూండిపోయింది!

ఆమె వింత ప్రవర్తనకు స్తబ్దుడనయ్యాను. ఆమె ఎందుకిలా ప్రవర్తిస్తూంది....'? ఆమెకు ఇటువంటి సన్నివేశం ఇదే ప్రప్రథమమా....? ఇది అంత వూహించతగిందికాదు. ఆమెకు ఇటువంటివంటే పడదా....? నేనిక్కడకు రావడం ఇష్టం లేదా....?

నేను ఈ ప్రశ్నలకు సమాధానం ఆలోచించే లోపులో, ఆమె ఆ మంచమ్మీద నుంచి లేచి, నా దగ్గరకొచ్చి తేరిపార చూచి, ఏదోపెద్ద బరువు దించినట్టు నిట్టూర్పు వదలింది. ఆమెలో మొదట నేను చూచిన భయం, వణుకు కొద్దిగా తగ్గాయి.

".... రోజూ వచ్చే కాబూలీ సైతాన్....! రాలేదూ....?!"అంది నాకళ్లలోకి చూస్తూ.... ఆమె దృష్టిలో నేనుకూడా ఒక సైతాన్‌లా కనిపించానేమోనని పించింది.!

"కాబూలీ సైతాన్...!"

ఆమె ధోరణినిబట్టి విషయం గ్రహించాను. ఎవరో ఒక కాబూలీవాలా రోజూ వచ్చి, ఈమెను తన ఇనప హస్తాల్లో బంధించి, నలిపి పిప్పిచేసి పోయేవాడని గ్రహించాను.

"ఏం...? ఆ కాబూలీఅంటే నీకు భయమా." అన్నాను. అంతకంటే మరో విధమైన ప్రశ్న ఏమి వెయ్యాలో తెలియలేదు.

"భయమే కాదు — పరమ అసహ్యం! వాడు పశువు — రాక్షసుడు...! కసాయి....!!" ఇంకా ఏదో తిట్టింది ఆమె ఉద్రేకపడుతూ.... ఆమె నావంక హేయమైన దృష్టితో చూచి, గిరుక్కున తిరిగి మళ్లీ మంచమ్మీద పడుకుని, తలగడలో తలదూర్చి వెక్కివెక్కి ఏడవడం మొదలు పెట్టింది.

నేను నీరయి పోయాను. ఈమెకుఇటువంటివంటే సరిపడవేమో! అసలీమె ఇజమానురాలి బలవంతమ్మీద వప్పుకోవలసి వస్తుందేమో.! అసలీమె ఏవంశంలోదేనా..? వాళ్ళకి,ఈమెకూ సంబంధం ఎలా,కుదిరింది?" ఆమె ధోరణిని బట్టి చూస్తే, ఆమె జీవితంలో మానసికంగా చాలా దెబ్బతిని కృశించి పోయినట్టు కనిపించింది ఈ విషయాల్లో.

అసలు నేనిక్కడికి ఎందుకొచ్చానా! అనిపించింది. నేను వచ్చి ఆమె మనస్సును పాడు చేశానా....? తిరిగి వెళ్ళి పోదామనిపించింది.

ఆమె మంచం దగ్గరకువెళ్ళి, కొన్ని క్షణాలు నిలబడి అన్నాను.

"బహుశా నేనొచ్చి నీకు చాలా కష్టం కలిగించినట్టున్నాను...! నేను వెళ్ళి పోతున్నాను." అంటూ బయటకొచ్చెయ్య బోయాను.

కాని ఆమె ప్రక్కమీదనుంచి ఒహ్వాలున లేచి నాకడ్డు వచ్చింది.

"వద్దు—వద్దు— మీరు వెళ్ళవద్దు...! నాకేమి కష్టం లేదు..! నేను రోజూ అనుభవించేదే!

భగవంతుడు నా నొసటమీద అలా అని రాసాడు! ఎవరేం చేస్తారు?" అంటూ నాచేతులు పట్టుకుని బలవంతాన మంచం దగ్గరకు తీసుకొచ్చింది.

ఆమె నన్ను తాకినప్పుడు నాలోని ఉడుకు రక్తం పొంగలేదు. వళ్ళు పులకించలేదు. కాని ఆమె స్థితికి చలించి పోయాను. జాలి పడ్డాను.

ఆమెను కొద్దిగా పూరడించాను. ఆమెగురించి తెలుసుకోవాలని కుతూహలపడ్డాను. వీలయితే ఆమెను ఈ స్థితినుంచి తప్పించడానికి ఏదొక్క సహాయమయినా చేద్దామనిపించింది.

"దేనికలా చలించిపోతావ్...? నీకీవృత్తి అంటే యిష్టం లేదా...? అయితే నువ్వు యిందులోకి ఎలావచ్చావు?" అని అన్నాను.

"అంతా గ్రహచారం...! ...నా ఖర్మ...! ఒక్కొక్కప్పుడు ఈ మేడనుంచి దూకి చచ్చిపోవాలనుకుంటుంటాను. కాని ఆపని చెయ్యలేకుండా వున్నాను!" అని మళ్ళీ చేతులు ముఖానికి అడ్డుపెట్టుకుని ఏడవడం మొదలుపెట్టింది.

"నీ కేమీ ఫరవాలేదు చెప్పు....! నేను అందరిలాటి వాడను కాను. నిన్నీ నరకకూపం లోంచి తప్పించడానికి ఏసహాయమన్నా చేస్తాను......!"

నేను ఈ మాట అనగానే ఆమె నా కళ్ళలోకి చూసింది. తెల్లటి కళ్ళనిండా నీళ్ళు నిండాయి. చెక్కిలిమీద నీటి బిందువులు, పారలు తేరి, క్రిందకు జారలేక అలానే నిలిచి పోయాయి. వలిగి పోయిన గులాబి రేకుల్లాంటి పెదాలు కదిలాయి.

"అవును—మీరు అందరిలాంటి వారు కారనే నేను గ్రహించాను. ఎందుకంటే యింత వరకూ నాజీవితంలో యిక్కడకువచ్చి నా స్థితిని చూచి తిరిగి వెళ్ళి పోతానన్న వ్యక్తిని చూడలేదు. అని, నిట్టూర్చి అంది మళ్ళీ: "నావిషయంలో సహాయం చెయ్యడానికి ముందుకొచ్చే వాళ్ళుండరని నాకు తెలుసు. భగవంతుడు కూడా సహాయం చెయ్యడు. నా అదృష్టం భగ్నమై ఈ నరకంలో పడ్డాను. యిక నా బ్రతుకున్నంతవరకూ విముక్తి లేదు."

ఆమె మౌనంగా కూర్చుంది కొన్ని క్షణాలు. ఆమె జీవిత విశేషాలు తెలుసుకోవాలనే కుతూహలం హెచ్చింది నాలో.

"ఆ లావుపాటి ఆమె లేదూ? ఎవరు? నీకేమవుతుంది...?" అన్నాను. ఆమెమాట ఎత్తగానే అసహ్యించుకుంది.

"ఛీ! ఛీ! ఆమె నాకు ఏమీ కాదు....! ఆమె రాక్షసి. అందమైన అమ్మాయిలను కొని, ఈ విధంగా డబ్బు సంపాదిస్తూంటుంది! పాపిష్టి!"

"కొంటమా..?" నేనాశ్చర్యపోయాను.

"అయితే నువ్వు యిక్కడకెలా వచ్చావు? నిన్ను కూడా కొన్నదా ఆమె...?"

"ఊఁ ఎప్పుడో చిన్నప్పుడే! అంతా తలుచుకుంటే నాకు యింక బ్రతకాలనిపించదు...." అంటూ ఆమె కళ్ళు తుడుచుకుంది.

ఆమెను పూరడిస్తూ, గదిలో ఉక్క పోస్తుంటే గదిబయట వరండాలోకి తీసుకొచ్చాను. అక్కడేవున్న ఫేము కుర్చీలో కూర్చున్నాను. ఆమె అలానే కుర్చీ పట్టుకుని నిలబడింది.

వీధుల్లో జన సంచారం లేదు. అప్పుడప్పుడు తిరిగే టాక్సీలు,లారీలుతప్పవీధిలోని భవనాల్లోని కిటికీలగుండా కాంతి చిమ్ముతుంది. ఎక్కడో దూరంగా 'లైట్‌హవుస్'' మినుకుమినుకుమంటూ తిరుగుతోంది. అప్పటికి రాత్రి పన్నెండుగంటలు దాటింది. చంద్రుడుఆకాశంలో ప్రకాశిస్తున్నాడు.

ఆమెను గుచ్చి గుచ్చి అడగ్గా ఆమెకథ చెప్పడము మొదలు పెట్టింది. "నేం మొదట్లో లాహోరులో వుండేవాళ్ళం. మా అమ్మమ్మ నేనూ, మానాన్న మాత్రమే వుండేవాళ్ళం. మా అమ్మ ఎలావుంటుందో నేను చూడలేదు. చిన్నప్పుడే చచ్చిపోయిందట. అమ్మమ్మ చెప్పేది.....

మానాన్నంటే నాకు ఎంతో ప్రేమ. ఆయన ఎప్పుడు యింటిదగ్గరవున్నా ఆయన వడిలోనే వుండేదాన్ని. మాయింటి దొడ్లో గొర్రెపిల్లను మేపుకుంటూ వుండేదాన్ని ఆడిస్తూ ఆడుకున్న రోజులునాకింకా గుర్తున్నాయి. మాదొడ్లోవున్న గులాబీపూలు దండలు అల్లి లాహోరులో అమ్మి రావడం నాకింకా గుర్తుంది.....!

అప్పటికి నాకు అయిదేళ్ళు. ఆరోజు మా యింట్లోఎంతో సందడిగావుంది. ఇంటినిండా చుట్టాలే. వాళ్ళంతా కలసి డోలక్‌మీద పాటలు పాడుతూ నాట్యం చేస్తూంటే, నేనూ కలిసి పాడటం నాకు గుర్తుంది. ఆరోజున అమ్మమ్మ చెప్పింది. నీకు కొత్త అమ్మవస్తోందని...!" అలా చెప్పేటప్పుడు అమమ్మ నన్ను కౌగలించుకుని ఏడ్చింది. నాకు అమ్మ వస్తుందంటే అమ్మమ్మకు ఏడుపు దేనికో అప్పట్లో అర్థం కాలేదు.

మాకొత్తమ్మ వచ్చింది. కాని అనుకున్నంత మంచిదికాదు ఆవిడ. నన్నెప్పుడూ కొడుతూ తిడుతూండేది.

ఒకనాడు మానాన్న బయటనుంచి వస్తూ, గుమ్మంలోంచి విరుచుకుపడిపోయాడు ఎందుకో? అంతా లేవదీసి ప్రక్కమీద పడుకోబెట్టారు అందరూ కళ్ళు అద్దుకోడం నేను మర్చిపోలేదు.

ఆరోజు అర్థరాత్రి,నేను అమమ్మ ప్రక్కలో పడుకుని వుండగా అంతా ఎందుకో గొల్లుమన్నారు. నాకు భయం వేసింది. తెల్లవారిన తరువాత అమమ్మ చెప్పింది. "మానాన్న యింక లేడు అని.

కొన్నాళ్ళవరకూ నాన్న కనిపించక పోయేసరికి రోజూ నాన్నకోసం ఏడ్చేదాన్ని. మాకొత్త అమ్మ మాత్రం ఎంచేతో నాలాగ ఏడ్చేదికాదు. నేనేడుస్తుంటే పూరుకోమని తిట్టేది.

కొన్నాళ్ళకు ఎవరో కొత్త అతను మాయింటికొస్తూండేవాడు. అతనితో మా 'అమ్మ' నవ్వుతూ మాట్లాడేది. అతనితో ఎక్కడికో పూళ్ళోకి వెళ్ళి వస్తూండేది.

ఒక రోజున మా అమ్మ అంది, "మనం రేపు పూరికి వెళుతున్నామని.'

మాతోపాటుగానే పూరికి అతను కూడా వచ్చాడు. అమ్మమ్మ రాలేదు. మేము అతని యింట్లోనే వున్నాము. అతనంటే నాకెందుకో నచ్చేదికాదు. ఎప్పుడు నాన్నే గుర్తు కొస్తూండేవాడు.

ఒక రోజున నన్ను, అమ్మ అతనూ కలసి ఈ మేడలోకి తీసుకొచ్చారు. ఆ లావుపాటి ఆమెతో ఏవేవో మాట్లాడారు. తరువాత నన్నిక్కడే వుండమని చెప్పి వెళ్ళిపోయారు. అంతే! మళ్ళీ యిప్పటివరకూ వాళ్ళు ఇక్కడకు రాలేదు. తరువాత ఆ లావుపాటి ఆమె నాతో చెప్పింది." వాళ్ళు యిక రారు. నువ్విక్కడే వుండాలి..! నిన్ను కొనుక్కున్నాను...!" అని.

అప్పటినుంచి వీళ్ళింటిలోనె పెరిగాను. అంటే యిప్పటికి పన్నెండు సంవత్సరాలనుంచి యిక్కడే పెరిగాను. మొదట వాళ్ళ వృత్తిలోకి దిగమని బలవంతంచేసేవాళ్ళు.కొట్టేవాళ్ళు.చివరకుచేసేది లేక. బయటకుపోయేదారిలేకఒప్పుకోవలసివచ్చింది. యిప్పటికి నాకు రోజూ తిట్లు, తన్నులు, తగులుతూనేవుంటూంటాయి ఒకోరోజు.

నాకు వ్యక్తుల్ని ఆకర్షించే శక్తి, వలలో వేసుకునే నేర్పు లేదట. నేనెప్పుడూ దిగులుగా వుంటానట...! నవ్వడం నాకు చేతగాదట..!

ఎలా నవ్వుతాను... నవ్వు ఎలావుంటుందో నేను మర్చిపోయాను—!

యిక్కడకు రకరకాలవాళ్ళు వస్తూవుంటారు. డబ్బున్న ప్రతివాడికీ నామీద సర్వాధికారాలూ వున్నాయి. క్రొవ్వి మత్తెక్కిన గొర్రెపోతుల్లాంటి కామాంధులు పొట్టలునిండా బంగారం దాచుకుని పూపిరి తియ్యడానికికూడా ఆయాసపడే సేట్‌లు ... యిలా రకరకాల పశువులు వస్తూవుంటారు. ... యివ్వాళ మీరు వచ్చారు. రేపు ఎవరో ... ?

అని ఆమె నిట్టూర్చింది.

ఆమె చరిత్ర అంతా విన్నతరువాత నేను కొన్ని క్షణాలు మౌనంగా వుండిపోయాను. ఆమెను యిటువంటి పరిస్థితులలోనుండి తప్పించాలంటే నే చెయ్యగల సహాయమేది? చెయ్యదలిస్తే రెండే రెండు మార్గాలు ఉన్నాయి. ఈమెకు ఎవరైనా బంధువులుగాని, మరెవరోగాని తెలిసివుంటే ఈయజమానురాలికి కొంత పరిహారం చెల్లించి ఈమెను వాళ్ళ దగ్గరకు చేర్చడం, లేకపోతే సాహసించి పెళ్ళి చేసుకోవడం ... ! నిజంగా యీ పని చెయ్యగలనా..? ఎందుకు చెయ్యలేను..? నన్ను కాదనేవాళ్ళు ఎవరున్నారు. అయినా యీమె ఉద్దేశ్యాన్ని తెలుసుకోవాలని అన్నాను:

"నీకు మీపూరులో తెలిసిన బంధువులెవరయినా వున్నారా..?" అని.

ఆమె తలవూపింది.

"లేరు — నాచిన్నప్పుడెప్పుడో ఒక అమ్మమ్మ మాత్రం వుండేదని చెప్పాను, ఆమె యిప్పటికి వరకూ వుంటుందంటే నాకు నమ్మకం లేదు..! నన్నెవరూ గుర్తుపట లేరు. . బహుశా నేను కూడా గుర్తుపట్టలేనేమో ఎవరిని. . !" అని కొసి

క్షణాలు ఆగి అంది ఆమె : "యిక నాకు ఈ పంజరంలోనుంచి విముక్తి కలుగదని నాకు తెలుసు. కలిగినా నేను ఎక్కడ తలదాచుకోవాలో... ఎలా బ్రతకాలో నా కర్థంకాదు... అందుకని చేసేదిలేక పాపపంకిలమైన శరీరాన్ని మోస్తూ, జీవచ్ఛవంలా బ్రతుకుతున్నాను... అయినా బ్రతుకుమీద ఇకఆశలేదు. ఏనాడో ఒకనాడు నేను చనిపోవడానికే నిశ్చయించుకున్నాను. . !" అని ఆమె వ్యధనంతా బయటకు వెళ్లగ్రక్కి, మళ్లీ వెక్కివెక్కి ఏడవటం మొదలు పెట్టింది. . .

ఆమెను ఎలా వూరడించాలో నాకర్థంకాలేదు. యిలా జరుగుతుందని ఏనాడూ అనుకోలేదు. . . యిక ఆమెను ఏమీకష్టపెట్ట దలచుకోలేదు. నేను సాహసించి అన్నాను.

'నాతో వచ్చెయ్యడం నీకిష్టమేనా. . . ?" నేను బాగా ఆలోచించినమీదటే అన్నా నీమాట.

ఆమె ఉలిక్కిపడ్డది. నావంక వెర్రిగా చూచింది.

"ఎక్కడకు. . .?"

"ఎక్కడకేమిటి ? నే నెక్కడకెళితే అక్కడకు. నే నెక్కడుంటే అక్కడకు. .!"

"అంటే. .!" అంది ఆమె యింకా సందేహంగానే.

"అంటే, నిన్ను పెళ్లిచేసుకుంటాను. .నీకిష్టమేనా . .?"

"నన్నా. ! పెళ్లా. . .?" అంది తెల్లబోతూ. .

"అవును — తప్పేమిటి. . ? నన్ను కాదనే వాళ్లు ఎవళ్లూలేరు — నాకు నచ్చింది, నాకిష్టమైంది చేసుకున్నప్పుడు నన్ను ఎవరూ కాదనరు. .! ఆమెకు ఎంతడబ్బుఅయినా యిచ్చి నిన్ను తీసుకెళతాను. నీకిష్టమేనా. ?"అన్నాను.

అర్థనిమీలిత నేత్రాలతో నాకళ్లలోకిచూచింది ఆమె. . పెదాలు చలించాయి. ఈమాట అనగానే ఆమెలో ఎక్కడలేని ఉత్సాహం కట్టత్రెంచుకుని ప్రవహించింది. అంత ఉత్సాహం ఆమెలో కలగటం ఆమె జీవితంలో యిదే మొదటిసారేమో!

"మీరు నాగురించి, అంతసాహసం చేస్తే నేను జన్మజన్మలకీ మీచరణాలముందే పడివుంటాను. !" .అంటూ ఆమె నా పాదాలముందు వాలిపోయింది!

నేను ఆమెను లేవదీసి ధైర్యం చెప్పాను. తప్పకుండా ఆమెను పెళ్లిచేసుకోవాలనే నిశ్చయించుకున్నాను. . .

అప్పటికి రెండయింది. పట్టణం అంతా మాటుమణిగింది. మేము గదిలోపలకి వచ్చేసాము. . ఆకాశంలో చంద్రుడు మబ్బులోదాక్కున్నాడు.

• • •

తెల్లవారింది.

నేను రూమ్‌కొచ్చేసాను. వచ్చేటప్పుడు, ఆమెతో మళ్లీ రాత్రికి యిక్కడకు తప్పకుండా వస్తానని చెప్పి వచ్చేశాను. ఎలాగయినా ఆ యజమానురాలిని వప్పించి, ఆమెను ఆ పరిసరాల్లో వుండాల్సిన అవసరంలేకుండా చేస్తానని చెప్పి, ఆమెకు నమ్మకం కలిగేలా చెప్పి వచ్చాను. నేను వచ్చేటప్పుడు, ద్వారబంధానికి తల ఆన్చి వెక్కివెక్కి ఏడ్చింది. ఆమెను ధైర్యంగా వుండమని, నేనుమాట తప్పనని ఆమెకు నచ్చచెప్పి వచ్చాను. ఎన్ని అవాంతరాలు వచ్చినా ఆమెను నేను వివాహం చేసుకుంటానికే నిశ్చయించుకున్నాను.

ముందుగా ఈవిషయం శంకర్‌తో సంప్రదించి, ఆమెతో (యజమానితో) సంప్రదించే ఏర్పాటు చేయిద్దామనుకున్నాను. బహుశా నేను చేసే ఈపనికి శంకర్ ఒప్పుకోకపోవచ్చును— అయినా నేను గట్టిపట్టుబడితే అతనూ కాదనలేడని నాకు తెలుసు. . 'కా'దన్నా నేనూరుకునేది లేదు.

బాత్‌రూమ్‌లోకెళ్లి, స్నానంచేసిన మీదట, హోటల్ బోయ్ తెచ్చి టేబుల్‌మీద పెట్టిన కాఫీ, టిఫెన్ చేసి, బయలుదేరాను శంకర్ దగ్గరకు.

యింటిదగ్గర శంకర్ కుర్చీలో కూర్చుని ఏదో ఆలోచనలో మునిగి ఉన్నట్టు ఉన్నాడు. అతని ముఖం ఎందుకో వాడినట్టువుంది. అరుగుమీద, వాళ్లయింటి నౌకరుబెడ్డింగు ఆదీ సర్దుతున్నాడు. యిదంతా చూస్తుంటే ఎక్కడికో ప్రయాణమవుతున్నట్టు తోచింది.

నేను వాకిట్లో అడుగు పెట్టగానే, శంకర్ కుర్చీలోనుంచి లేచాడు. నన్ను చూడగానే చిరునవ్వు అతనిముఖంమీదకు వచ్చి వెంటనే మాసిపోయి గంభీరంగా మారిపోయింది అతని ముఖం.

"నేనే రావాలనుకున్నాను సతీష్ నీ కోసం.. అంతలోకి నువ్వే వచ్చేసావ్—రా..! కూర్చో" అంటూ కుర్చీ చూపించాడు.

నేను అతని ధోరణి అర్థం గాక మౌనంగానే కుర్చీలో కూర్చున్నాను.

శంకర్ చెప్పుకొచ్చాడు. పూనాలో తమ్ముడి దగ్గరుంటున్న తనతండ్రికి చాలా జబ్బుగా వుందటూ టెలిగ్రాం అందిందని రాత్రిబండి దాటిపోవడంవల్ల యిప్పుడు బయలు దేరాల్సి వచ్చిందని—అని, కొన్ని క్షణాలాగి, "భాయ్ నువ్వుకూడా నా వెంటరావాలి....! నీ కేమన్నా అభ్యంతరమా....?" అన్నాడు ప్రాధేయపడే ధోరణిలో.

కొన్ని క్షణాలవరకూ ఏమి మాట్లాడాలో అర్థం కాలేదు. నేను వచ్చేటప్పుడు శంకర్‌తో ఏవేవోచెప్పాలనుకున్నాను. కానీ యిలాపరిణమించుతుందని అనుకోలేదు.

అతను యిటువంటి సమయంలో తనవెంట రమ్మన్నప్పుడు రానని తప్పించుకోడానికి మనస్కరించలేదు. నేనిక్కడ వక్కణ్ణీవున్నా చెయ్యవలసింది ఏమీ లేదు శంకర్ సహాయం లేందే. అందుకని అతనితో బయలు దేరడం తప్పనిసరి అయింది.

వెంటనే బయలు దేరాము.

టయినులోకూడా శంకర్ తనతండ్రి గురించే చెప్పుకొచ్చాడు. నామనస్సంతా మరోవైపుకు పరుగెత్తుతోంది.

తన తండ్రికీ, తనకు కొన్నాళ్ళక్రితం ఏవో స్పర్థలు వచ్చాయని అప్పటినుంచీ తన తమ్ముడి దగ్గరే పూనాలో వుంటున్నాడని తండ్రి విషయంలో తనేమీ అన్యాయం చెయ్య లేదనీ, అతనే తనను అపార్థం చేసుకున్నాడని చెప్పుకొచ్చాడు. అంతేకాని రాత్రి విషయం అసలు ప్రస్తావనలోకి తేలేదు. నేను అతని మనస్సు వికలమై వుండటం కనిపెట్టి ఆ విషయం ఏమీ ఎత్తలేదు. వూరికే అతను చెప్పేవాటిని వింటూ కూర్చున్నాను రైల్లో.

అయితే మేం అక్కడికి చేరుకునే లోపలే అంతా జరిగి పోయింది. ఆరాత్రే అతనితండ్రి పోయాడు. శంకర్ తండ్రిని కడసారి కూడ చూచుకోడానికి నోచుకోలేకపోయానంటూ కుమిలి కుమిలి ఏడ్చాడు.

అతని కర్మ, అదీ అయి, మళ్ళీ తిరిగి చేరుకునేసరికి, మూడురోజులు జరిగి పోయాయి. శంకర్‌ను వాళ్ళయింటి దగ్గర దింపి అతన్ని వూరడించి నారూమ్‌కు వచ్చేసరికి రాత్రి ౮ గం అయింది.

ప్రయాణపు బడలికవల్ల చాలా చికాకుగా వుంటే స్నానం చేసాను. నామనస్సు పరి పరి విధాలపోతోంది. టేబుల్‌మీదఉన్న కేరియర్ అలానే వుంది. భోజనం చెయ్యడానికి మనస్కరించడం లేదు.

ఆమె ఎలావుందో.....? నన్నుగురించి ఏమనుకుని వుంటుందో? వట్టి మోసగాడిక్రింద కట్టి వుంటుంది. అయితేంయిలాజరక్క తప్పలేదు. ఆమె నాగురించి ఈమూడు రోజుల్లో కాచుకు కూర్చుని వుంటుంది. ఎవరో ఒకరి ఇనుప హస్తాల్లో నలిగి పోతూ నన్ను తలచుకుని తిట్టుకుంటూ అందరిలాగే నన్నూ, వాళ్ళలో జమ కట్టివుంటుంది. ఆమెను ప్రసన్నత చేసుకుందుకు వేసిన ఒక రకపు ఎత్తు అనుకుంటుంది.

వరండాలోకి వచ్చి చూచాను. ఆమేడవైపు ఆకిటికీల ఆకుపచ్చని కాంతుల్లోనుంచి ఏవో నీడలు తిరుగాడుతున్నాయి యథాప్రకారంగా మేడదగ్గర రెండు కార్లు మాత్రం ఆగివున్నాయి.

అవి చూచినకొద్దీ నాలో ఆతురత ఎక్కువ అవడం మొదలు పెట్టింది.

"యిప్పుడు ఆమెతో మాట్లాడటం ఎలా? ఈ సమయంలో అది లభ్యమవుతుందా?యిప్పటికే మరొకరి"......!

యిక నాకు నారూమ్‌లో వుండబుద్ధి అయిందికాదు. కిందకువచ్చి, రోడ్డుమీద నిలబడ్డాను కొద్ది క్షణాలు యోచిస్తూ.

చివరకు అక్కడకు వెళ్ళి ఏవిషయమూ తెలుసుకొద్దామని నిశ్చయించుకున్నాను శంకర్ తోడు లేకపోయినా.

అప్పుడే నా ముందునుంచి పోతున్న టాక్సీని ఆపి ఆమేడదగ్గరకు తీసుకెళ్ళమన్నాను.

కారుదిగి, లోపలకు వెళ్ళటానికి కొన్ని క్షణాల వరకూ వెళ్ళలేక, నిలుచుండి పోయాను. అక్కడే నిలబడి లోపలకు చూచాను.

మధ్యలో హాల్లో మాత్రం యింకా లైట్లు వెలుగుతూనే వున్నాయి. హాలులో ఎవరో మాట్లాడుతున్నట్టు, నవ్వుతూన్నట్టు, శబ్దం వినిపిస్తోంది.

మెల్లగా అడుగులు వేసుకుంటూ అరుగెక్కగానే, లోపల సోఫాలో కూర్చుని, ఆ లావుపాటి ఆమె కనిపించింది....

నేను కనిపించగానే ఆమె నవ్వుతూ బయటకు వచ్చింది.. "నమస్తే..! మళ్లీ చాలా రోజులకు వచ్చారు—మీమిత్రుడేడీ..?" అని, ఎప్పుడూ 'పాన్' నములడంవల్ల గారపట్టిన పళ్ళన్నీ కనిపించేలా నవ్వి, "నేను అప్పుడే చెప్పలేదూ? యికనుంచి మీమిత్రుడు తోడు రానవసరంలేదని....!" అంది

ఆమెను చూస్తుంటే చాలా అసహ్యమనిపించింది—

ఆమె నన్ను ఆ హాలులోకి తీసుకెళ్లి కూర్చోమంది. ఆహాలులో మరో యిద్దరు యువతులు కూడావున్నారు—

"చూడండి..! ప్రత్యేకంగా ఈవిషయం మాట్లాడడానికి వచ్చాను.. మీతో అసలు . మొన్ననే మాట్లాడవలసింది. ! కొన్నిఅవాంతరాలవల్ల మళ్ళీ యిక్కడకు రాలేకపోయాను," అన్నాను కొంచెం జంకుతూనే.

'దానికేం...? మాట్లాడండి !" అంటూ నవ్వింది ఆమె.

"అలాకాదు— ఏకాంతంగా మాట్లాడాలి ." అన్నాను. అక్కడున్న యిద్దరు యువతుల వైపు చూస్తూ— ఆమె నాఉద్దేశ్యాన్ని కనిపెట్టి వాళ్లను లోపలకెళ్లమని చెప్పి, "చెప్పండి..! ఏమిటో..?" అంది.

నేను క్షణంవరకూ మౌనంగా వుండి అన్నాను..

"ఆ..మె..!.. ...."

యింకా నామాట పూర్తికాకుండాగానే నవ్వింది ఆమె.

'క్షమించండి..! ఆమె ప్రస్తుతం లభ్యంకాదని చెప్పడానికి చింతిస్తున్నాను... రేపయితే..!" అంటూనసిగి, ప్రస్తుతం అంతకంటే మంచి ఏర్పాటుచేస్తాను మీకిష్ట మైతే...!" అంటూ నాకళ్లలోకి చూసింది..

ఎలాగు యిలా జరుగుతుందని నేను మొదటే వూహించాను..కాని ఏవిధంగానయినా ఆమెతో ఈ రాత్రే మాట్లాడేలా ఎలా చేసుకోవాలో అర్థం కావడంలేదు— ప్రస్తుతం ఆగదిలోవున్న వ్యక్తి

ఏదో తట్టగానే లేచి, జేబులోనుంచి కొన్ని నోట్లుతీసి (ఎన్నుంటాయో లెక్కపెట్టలేదు) టేబుల్‌మీద పెడుతూ అన్నాను :

"చూడండి—! ప్రస్తుతం ఆమెతో ఒక్కసారి మాట్లాడే ఏర్పాటు చెయ్యండి..! చాలు.. తక్కిన విషయాలు రేపు మాట్లాడుతానుశంకర్ తోవచ్చి.. ..!" అన్నాను.

టేబుల్‌మీద పడివున్న నోట్లు చూడగానే ఏదో ఆశ స్ఫురించింది ఆమె ముఖంలో. . కాని వెంటనే నిరుత్సాహపడిపోయింది. పేలవంగా నవ్వి, పెదవి విరచింది.

"మీరు ఒకగంటముందు వచ్చివుంటే బాగుండేది. .! ప్రస్తుతం ఆమెను అక్కడనుంచి కదిపేగుండెలు ఎవరికీ వుండవు— ఎందుకంటే అక్కడున్నవాడు చాలా అసాధ్యుడు. .!" అంది నిట్టూరుస్తూ. . .

"అసాధ్యుడా . .? అంటే. !" అన్నాను ఏమీ అర్థంగాక.

"అవును అసాధ్యుడే! వాణ్ణి యిప్పుడు మాట్లాడించలేం. .! ఎప్పుడూ వచ్చే కాబూలీ. .! అదంటే పడిచస్తాడు. .! అయినా యిప్పుడు చిత్తుగా తాగివుంటాడు. . ఎవరూ కదపలేరు . . రేపు తప్పకుండా ఏర్పాటు చేస్తాను. .!"

యిది వినగానే ఉలిక్కిపడ్డాను. .

"కాబూలీ! చిత్తుగాతాగివున్న కాబూలీ! రోజూవచ్చే కాబూలీ. .!

యిక నాకు ఏమిమాట్లాడాలో అర్థంకాలేదు. వాడంటే ఆమెకు ప్రాణసంకటం. . . వాడి యినపహస్తాల్లో నలిగిపోతూ సతమతమవుతూంటుంది. ఆమెను ఎలా కలుసుకుంటం. . గట్టిగా ఈమెను శాసించే అధికారం నాకేముందని . ? ఏమీ చేసేదిలేక కొన్ని క్షణాలు అలానే కూర్చుండిపోయాను తలవంచుకుని. . . అంతకంటే ఆసమయంలో నేను చెయ్యగలిగింది ఏమీ కనిపించలేదు.

నా మౌనానికి భంగం కలిగిస్తూ ఆమె అంది.

"మీకు ఆమే కావాలని సిద్ధాంతం ఏమిటి. .? మీరు కోరుకుంటే అంతకంటే వందరెట్లు మిమ్మల్ని ఆకర్షించేవాళ్లున్నారుగా. యివ్వాల్టికి ఈ ఏర్పాటు చేస్తాను. .! మీకిష్టమేనా ?" అంది, నన్ను ఎలాగూ అక్కడనుంచి బయటకు పంపకుండా వుండాలనే ఉద్దేశ్యంతో. .

నాకు అక్కడ యిక క్షణం వుండబుద్ధికాలేదు. వెంటనే బయటకు వచ్చేద్దామని లేచి నిలబడ్డాను.

నా తొందరపాటుకు ఆమె నిరుత్సాహపడ్డది.

"ఏ. .? లేచారే. .? వుండిపోగూడదూ. .? తిరిగి వెళ్లకపోతే ఏం. . .? అంది ఆమె.

కానీ నాకు ఏమీ సమాధానం యివ్వబుద్ధి కాలేదు. ఆమె ఉండమని ఎంత బలవంతం చేస్తున్నా వినిపించుకోకుండా చరచరా బయటకొచ్చేశాను. ఆ టేబుల్‌మీద ఉన్న నోట్లుకూడా తిరిగి ముట్టుకోబుద్ధికాలేదు. .

రూమ్‌కొచ్చాను. ప్రక్కమీద పడుకున్నా. నిద్రరావడంలేదు. మనసంతా వికలమైవుంది. రూమ్ కిటికీలోనుంచి అన్నీ నీడలు కదులుతూన్నాయి. ఆమెకళ్ళు అతిదీనంగా, జాలిగా, కన్నీళ్లతో నిండి కనిపిస్తూన్నాయి.

లేచివెళ్ళి, నారూమ్ కిటికీలు మూసివేశాను. కళ్లు మూసుకున్నా అవేదృశ్యాలు నాకళ్లముందు కనిపించేవి. నా రూమ్‌లో ఎవరో వెక్కి వెక్కి ఏడుస్తూన్నట్టు వినిపించేది ఆమె కళ్లుమిసుకు మిసుకున నాకళ్లముందు మెరిసేవి. . .!

ఆఖరికి బలవంతంగా కళ్లుమూసుకున్నా ఏడు కుర్చీలో ఎప్పుడో అర్థరాత్రి నాకు తెలియకుండానే నిద్రపట్టింది.

* * *

తెల్లవారింది. చాలాప్రొద్దెక్కిందేమో. . వెంటిలేటర్సు' అద్దాలలోనుంచి రంగురంగుల నీడలు పడుతున్నాయి నాగదిలో. .

హోటల్ బోయ్ అప్పుడే కాఫీ తీసుకొచ్చి టేబుల్‌మీద పెడుతూన్నాడు.

నేను ప్రక్కమీదనుంచి అప్పుడే లేస్తోంటే వాడన్నాడు .

"ఈవేళ యింతసేపు పడుకున్నారేసార్ ! రాత్రి సినిమాకుకూడా వెళ్లకుండా తిరిగి 9గం కే వచ్చేసారుకదా ?" అని, ట్రేని టేబుల్‌మీద పెట్టి క్రిందికి దిగి వెళ్లిపోయాడు.

నేను బీరువాలోనుంచి, బ్రష్షు, అది తీసుకుని బాత్‌రూమ్‌లోకి వెళ్లాను ముఖం కడుక్కుందుకు.

ముఖం కడుక్కునివచ్చిన తరువాత, టవల్‌తో ముఖం తుడుచుకుంటూవెళ్ళి, రూమ్ కిటికీ తలుపులు తీసాను.

తియ్యగానే ఎందుకో గుండె ఝల్లుమంది. !

అక్కడ. . ఆమేడదగ్గర ఎవరో చాలామంది గుంపుగూడివున్నారు యిద్దరు ముగ్గురు పోలీసు వాళ్లుకూడా వున్నట్టు కనిపించారు.

అక్కడ అంతమందిఎందుకు గుంపుకూడారో అర్థంకాలేదు. పోలీసులు వుండాల్సిన అవసరం ఎందుకొచ్చిందో అర్థంకాలేదు.

అయినా అక్కడకెళ్లి, అది ఏమిటో తెలుసుకునేవరకూ నా మనస్సు ఆగిందికాదు వెంటనే కాఫీకూడా త్రాగకుండానే క్రిందికిదిగి వెళ్లాను.

రోడ్డుమీద జనం చాలామంది అటువైపుకే వెడుతూన్నారు. . వాళ్లతో కలసి నేనూ వెళ్లాను ఆమేడ దగ్గిరకు. .


అక్కడ నేను చూచిన దృశ్యం జీవితంలో మరువలేను. అది నాహృదయంమీద పెద్ద దెబ్బలా తగిలి, గుండెలను చీల్చివేసింది. .

ఆమె. . ఆ పంజాబీపిల్ల— ఆమేడక్రింద, ఆమె గదికి తిన్నగావున్న రోడ్డుప్రక్కన రక్తపు ముద్ద అయి పడివుంది. . ! !

ఆ దృశ్యం చూడలేకపోయాను. నాకళ్లల్లోకి ఏదో మైకం క్రమ్మి, చీకటి క్రమ్ముకున్నట్లయింది. కాళ్లు ఎంత నిలద్రొక్కుకున్నా అక్కడ నిలబడలేనిపరిస్థితి ఏర్పడిపోయిందినాలో.

ఆమె ఎలాచనిపోయింది. .? హత్య .. ? అయివుండదు — ఆమె విరక్తిచెంది, ఆ మేడమీదనుంచి దూకి ఆత్మహత్య చేసుకునివుంటుంది ఆమె అన్నంతపనీ చేసింది . . దీనికి నా ఆలస్యమే కారణమా ? యిక తన జీవితం అంతే అనుకుందేమో. .! నాగురించి చూచి, చూచి, నామాటలు కూడ మోసం అనుకుని, తన జీవితానికి యిక వెలుగు రాదనుకుని ఈ సాహసం చేసిందా ? అయినా యింత తొందరపడిందే.

ఆ భయానక దృశ్యాన్ని నేను చూస్తానని



## నౌకాయానం

—వై. రామప్రసాదరావు

ఏనాడూ వూహించలేదు! ఆ దృశ్యాన్ని పదేపదే చూస్తూ అక్కడ వుండబుద్ధి కాలేదు.

వెంటనే రూమ్‌కొద్దామనుకున్నాను. కానీ రూమ్‌లో వున్న ఆ దృశ్యాలు నాకు కనిపించి కలవరపెట్టక మానవు. శంకర్ యింటి కెళదాం అనిపించింది. బయలుదేరాను.

శంకర్ యింటికెళ్ళి, ఈ విషయం శంకర్‌తో చెప్పాను.

శంకర్ ఆశ్చర్యపోయాడు.

"ఆమెను మేడమీదనుంచి తోసి, ఆత్మహత్య చేసుకోవలసిన అవసరమేమొచ్చింది సతీష్! ఇలా చేసిందంటే నాకేమీ నమ్మకం కలగటం లేదు... తప్పనిసరిగా హత్యగాని ... ప్రమాదవశాత్తూ జారిపోయిగానీ వుంటుంది!" అన్నాడు శంకర్...

కానీ అసలువిషయం శంకర్‌కేం తెలుసు...?

"నీకు తెలీదు శంకర్! ఆమె ఆత్మహత్యే చేసుకుంది...!" అంటూ, అసలు విషయం, ఆమె కథ అంతా వివరంగా చెప్పాను శంకర్‌తో.

అంతా విన్నతరువాత శంకర్ పెద్దగా నిట్టూర్చాడు.

"ఏం లాభం...? అంతా జరిగిపోయిం తరువాత ...! నువ్వు ఆవిషయం మొదటే ఎందుకు చెప్పలేదు?" అన్నాడు.

నేను మౌనంగా వుండిపోయాను - - ఎలా చెప్పగలను... ? అప్పటి పరిస్థితి వేరు — అయినా ఆమె యింత తొందరపడుతుందని నేను ఏనాడు అనుకోలేదు.

ఏది ఎలాగున్నా ఈ సంఘటన నా జీవితంలో పెద్ద దెబ్బ ...! యిక నాకు ఆ రూమ్‌లోనే వుంటూ గడపబుద్ధి కాలేదు. అసలు యింకా బొంబాయిలోనే వుంటూ, ఆ దృశ్యాల్ని తలచుకుంటూ, బాధపడుతూ గడపబుద్ధి కాలేదు — ఆవేళే ఆవూరు విడిచిపెడదామనుకున్నాను.

సాయంత్రం శంకర్‌తో కలిసి, నారూమ్‌కెళ్ళి అక్కడున్న నా బెడ్డింగు, బట్ట అవి తీసుకొచ్చేశాను.

ఆ రాత్రి ట్రైన్‌కే వెళ్ళిపోతానన్నాను. శంకర్ వుండమంటూ బలవంతపరచాడు. అయినా నాకు వుండబుద్ధికాలేదు.

నే వచ్చేటప్పుడు, ఆమెపడికెళ్ళి చూసి, రెండు కన్నీటిముక్కలు మాత్రం రాల్చాను. ఆమె నేను ఆమెగురించి అక్కడ వదిలిన గుర్తు.

ట్రయిన్ దగ్గరకు శంకర్‌కూడా వచ్చాడు నన్ను సాగనంపడానికి. అతనుకూడా ఆమెగురించి చాలా ఫీలయ్యాడు.

ట్రయిను మెల్లమెల్లగా బొంబాయి వదిలింది. పట్టణంలో లైట్లు మినుకు మినుకు మంటూ చాలాదూరం వరకు కనిపిస్తూనే వున్నాయి. పోను పోను అవీ దూరమైనాయి. బొంబాయికూడా దూరమైంది... కాని ... !

ట్రయిను వేగంగా నడుస్తోంది. బయట అంతా అంధకారం... ఆ అంధకారంలో మినుక మినుకుమ మెరిసే జ్యోతుల్లాంటి ఆమెకళ్ళు నా కంపార్ట్‌మెంటు ప్రక్కగానే, నాతోపాటుగానే ప్రయాణం చేస్తున్నాయి...! నా వెనకాల ఎవరో వెక్కివెక్కి ఏడుస్తున్నట్టు ధ్వని వినిపిస్తోంది... ఆమె కళ్ళు నావెనకాలే వస్తున్నాయి. నావంకే చూస్తున్నాయి....!

యిప్పుడు నే నెక్కడున్నా, ఏపనిలో వున్నా జాలిగా అమాయకంగా, నీళ్ళు నిండిన ఆమెకళ్ళు నాకు సాక్షాత్కరిస్తూ నన్ను కలవరపెడుతూ వుంటాయి....!

★